క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని సర్పంచ్ వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ నేత నగేష్ తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

నేడు డ్రోన్ల వినియోగంపై సదస్సు

బుక్కరాయసముద్రం: ఆలమూరు గ్రామంలో ఉద్యాన రైతులకు డ్రోన్ల వినియోగంపై బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఉద్యాన శాఖ అధికారి శైలజ పేర్కొన్నారు. సదస్సులో రైతులకు వ్యవసాయ పరికరాలు, వాటి పనితీరుపై అవగాహన కల్పిస్తారన్నారు. మండలంలోని రైతులు సదస్సులో పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

యాడికి: 7వ తరగతి ఉత్తీర్ణులై డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు ఎండీయూ ఆపరేటర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని సీఎస్‌డీటీ సూర్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. నగరూరు, భోగాల కట్ట, వెంగన్నపల్లె, పుప్పాల, పుప్పాలతండా గ్రామల్లో ఇంటింటికీ రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సంప్రదించాలని సీఎస్‌డీటీ సూచించారు.

ఆందోళన అధిగమిస్తే విజయం


ఎస్‌ఐ సురేష్ సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఆందోళనను అధిగమిస్తే విజయం దానంతట అదే సిద్ధిస్తుందని రూరల్ ఎస్‌ఐ సురేష్ పేర్కొన్నారు. పాతకొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పరీక్షలంటే భయమేల అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గురువులు చెప్పిన పాఠాలు ఎప్పటికప్పుడు నేర్చుకుని చదువుకోగలిగితే పరీక్షల్లో అద్భుత విజయాలు సాధించవచ్చన్నారు. పది పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో సినిమాలు, సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఎస్‌ఐను జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్, హెచ్‌ఎం గ్రేస్ మేరీ, ఉపాధ్యాయులు సత్కరించారు.

కుర్చీల వితరణ

గుంతకల్లు రూరల్: అంతర్జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం తిమ్మాపురం జెడ్పీ హైస్కూల్‌కు చైర్స్‌ను వితరణ చేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు రాజ్యలక్ష్మి, రామ్మోహన్ దంపతుల సౌజన్యంతో చైర్స్ వితరణ చేసినట్లు త్రిషాబన్సాలీ తెలిపారు. హెచ్‌ఎం మనోహర్, ఉపాధ్యాయులు, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

గుత్తి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాణి, గంగ, రేష్మా అపరిష్కృత సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేత మల్లేష్, అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ లీడర్లు పార్వతి, నాగలక్ష్మి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని గంగమ్మ గుడి ఆవరణలో మంగళవారం సీపీఎం నాయకులు ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.సీపీఎం నాయకులు దస్తగిరి, పెద్దయ్య, ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ జెడ్ వీరారెడ్డి 18వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో 100 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. అవసరమైన వారికి నంద్యాలలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు.

చిరుధాన్యాల సాగు మేలు


ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

బుక్కరాయసముద్రం: చిరుధాన్యాల సాగు లాభదాయకమని ఏడీఏ వెంకటరాముడు పేర్కొన్నారు. మంగళవారం దయ్యాలకుంటపల్లిలో చిరుధాన్యాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ తక్కువ నీటితో చిరు ధాన్యాల పంటలు సాగు చేయవచ్చన్నారు. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఉందన్నారు. సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ రైతులకు రాయితీలతో టార్పాలిన్లు ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ శివారెడ్డి, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, వీహెచ్‌ఏ నరేష్ పాల్గొన్నారు.

నవరత్నాలతో ఇంటింటా సంతోషం

• ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


నవరత్నాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: పేదలను ఆర్థికంగా అభివృద్ధి పరిచి వారి జీవనప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 16వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్తూ గడిచిన మూడున్నరేళ్ల జగనన్న పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాల ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరారు. డ్రైనేజీలపై అక్రమ కట్టడాలతో మురుగునీరంతా రోడ్లపై పారుతోందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, శానిటేషన్ అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే ప్రజల విజ్ఞప్తి మేరకు డ్రైనేజీలపై నిర్మించుకున్న అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి 98 శాతం హామీలను పూర్తి చేసి ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్ పేరుతెచ్చుకున్నారన్నారు. ప్రజలందరి చల్లని దీవెనలతో జనరంజక పాలన సాగిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, 16వ వార్డు కౌన్సిలర్ అర్షియాబేగం, కమీషనర్ బండిశేషన్న, ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రామలింగప్ప, వార్డు ఇన్‌ఛార్జ్ యూనస్, కౌన్సిలర్లు ప్రభాకర్, సుధాకర్, కోఆప్షన్‌సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, పార్టీ మాజీ టౌన్‌కన్వీనర్ ఎద్దుల శంకర్, వార్డు సచివాలయాల పట్టణ కన్వీనర్ జింకల రామాంజినేయులు, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్లు భీమలింగప్ప, దేవేంద్రప్ప, న్యాయవాది అశ్వర్థనారాయణ రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల సుభిక్షం కోసమే చండీయాగం


చండీయాగంలో పాల్గొన్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, కుటుంబ సభ్యులు

యల్లనూరు: తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల ప్రజలు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలు, పచ్చని పంటలు, పాడి సంపదతో సుభిక్షంగా ఉండాలనే చండీయాగం నిర్వహించినట్లు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. కొడవండ్లపల్లిలో మంగళవారం గ్రామ దేవత పెద్దమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు చండీయాగం నిర్వహించారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, సతీమణి రమాదేవి, తనయులు కౌన్సిలర్ హర్షవర్ధన్‌రెడ్డి, సాయి ప్రతాప్‌రెడ్డి, కోడలు సాయి హర్షిత, ధర్మవరం దివంగత ఎమ్మెల్యే సూర్యప్రతాప్‌రెడ్డి సతీమణి కళావతమ్మ, తనయుడు వెంకటకృష్ణారెడ్డి పూజలు చేశారు. అనంతరం గుడి ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లాస్1 కాంట్రాక్టరు వెంకటనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొడ్డుమర్రి ఈశ్వరరెడ్డి, వెంకటశివారెడ్డి, బొప్పేపల్లి రామాంజులరెడ్డి, పాతపల్లి నాగార్జునరెడ్డి, కొడవండ్లపల్లి తిరుపతినాయుడు, యల్లనూరు సుబ్బయ్య, నాగేశ్వరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కిరణ్, దంతలపల్లి పెద్దిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కొత్తపల్లి పురుషోత్తంనాయుడు, మేడికుర్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెస్తలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి


మాట్లాడుతున్న కేవీ రమణ

శింగనమల: జిల్లా వ్యాప్తంగా బెస్త కులస్తులు 4 లక్షలు మంది ఉన్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని బెస్త సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ కోరారు. మంగళవారం శింగనమలలో బెస్త సంఘం మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల్లో జిల్లాలో ఒక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కేటాయించి, రాజకీయ గుర్తింపు ఇవ్వాలన్నారు. శింగనమలలో బెస్త కులస్తులు అధిక సంఖ్యలో ఉన్నందున కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. కులదైవమైన గంగమ్మ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. సమావేశంలో బెస్త సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్, నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్, మండలాధ్యక్షుడు క్రిష్ణమూర్తి, నాయకులు గోపాలు, వెంకటనారాయణ, పాపారాయుడు, అమర్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి, ఫర్నీచర్ అందజేత


విద్యాసామగ్రి అందిస్తున్న చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతీరెడ్డి, మైమూన్

గుంతకల్లుటౌన్: పట్టణానికి చెందిన రిటైర్డ్ వీఆర్‌ఓ పాటిల్ రామలింగారెడ్డి జయంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు రెడ్డిస్ట్రీట్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లల కోసం 30 కుర్చీలతో పాటు విద్యాసామాగ్రి, ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. మంగళవారం రామలింగారెడ్డి నివాసం వద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ హాజరయ్యారు. పాటిల్ కుటుంబసభ్యులు నిర్వహిస్తున్న సామాజిక సేవలను అభినందించారు. రామలింగారెడ్డి కుమారులైన వీరశైవలింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, రిటైర్డ్ వీఆర్‌ఓ కేదార్‌నాథ్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మల్లికార్జున శాస్త్రీ, లోకిరెడ్డి, కౌన్సిలర్లు కెవి.నాగరత్నమ్మ, మెహరున్నీసా, రంగమ్మ, సుధాకర్, ప్రభాకర్, ఆంజనేయులు, వార్డు ఇన్‌చార్జ్‌లు మాచర్ల శివ, బ్రహ్మ, యూనస్, మార్కెట్‌వెంకటేష్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

పుట్లూరు: చెర్లోపల్లిలో సోమవారం రాత్రి ఓబుళమ్మ, కుళ్లాయప్పపై దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు. కోడి ఇస్తావా అని అడిగినందుకు దాడి చేశారని బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. సురేంద్రతో పాటు నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా మార్కండేయ స్వామి జయంతి


స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


సీజీ రోడ్డులో మార్కండేయస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: స్థానిక బీఎస్‌ఎస్ కాలనీలోని మార్కండేయ స్వామి ఆలయంలో స్వామి జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని తదితరులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేయించారు. అనంతరం ఆలయ పండితులు వారికి శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో పద్మశాలీయ మహాజన సంఘం పట్టణాధ్యక్షుడు పి.రామసుబ్బయ్య, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి గోపాల్, ముఖ్యసలహాదారు, మాజీ కౌన్సిలర్ తాడూరు గోపి, పద్మశాలీయ సంఘం పెద్దలు, కులస్తులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులో కేంద్రీయ విద్యాలయం వెనుక భాగంలో మార్కండేయ కాలనీలో వెలిసిన మార్కండేయ గుడిలో మంగళవారం పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో స్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు దాసా రమేష్, సీనియర్ నాయకులు దండు కృష్ణ, దండు శివ శంకర్, వెంకటేష్, నాగరాజు, పార్థసారథి, పెద్దయ్య, మనోహర్, తిమ్మప్ప, చలపతి, రామచంద్ర పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూర్ రోడ్డు సర్కిల్ సమీపంలోని మార్కండేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామి జయంతి ఘనంగా జరిగింది. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి మార్కండేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. బహూత్తమ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు గడ్డం గణేష్, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, ఉప కార్యదర్శి గడ్డం పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలతో రోడ్డు ప్రమాదాల నివారణ


మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాసులు

తాడిపత్రి: వాహనదారుడు రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఎంవీఐ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం టెక్ ఇంజినీరింగ్ కళాశాలలో రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంజినీరింగ్ విద్యార్థులకు రహదారి భద్రత, ప్రమాదాలకు కారణాలు, పాటించాల్సిన నిబంధనలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా 18 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్కుల వారి వల్లనే జరుగుతున్నాయన్నారు. ఐరాడ్ యాప్, గుడ్ సమారిటన్ వంటి వాటిపై విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఈవీ సుబ్బారెడ్డి, డీటీఏ నటరాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భాను ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అధికారులు, వాటర్ వర్కర్స్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ శరత్‌చంద్ర, డీఈ ఇంతియాజ్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కొర్రపాడు విద్యార్థి ప్రతిభ


విద్యార్థితో ఉపాధ్యాయులు

బుక్కరాయసముద్రం: కొర్రపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల హెచ్‌ఎం రామలింగప్ప మంగళవారం తెలిపారు. పాఠశాలలో టెన్త్ విద్యార్థిని లక్ష్మి ఇటీవల శ్రీకాకులం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ట్రిపుల్ జంప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించిందన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు పద్మావతి, రామాంజులరెడ్డి, శ్యామల, అనీల్ అభినందించారు.

ట్రాక్టర్ ర్యాలీ జయప్రదం చేయండి

తాడిపత్రి టౌన్: రైతుల సమస్యల కోసం గురువారం అనంతపురంలో నిర్వహించనున్న రైతుల ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం కార్యదర్శి రాజారామిరెడ్డి కోరారు. స్థానిక నంద్యాల రోడ్డులోని రైతు సంఘం కార్యాలయంలో మంగళవారం ట్రాక్టర్ ర్యాలీ పోస్టర్లను రైతు సంఘం నాయకులు విడుదల చేశారు. అనంతరం రాజారామిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూడటం శోచనీయమన్నారు.రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడం వంటి సమస్యలపై ట్రాక్టర్ ర్యాలీని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రైతు సంఘం మండల కార్యదర్శి వీరానాగిరెడ్డి పాల్గొన్నారు.

వితంతువులకు ఆర్థిక సాయం

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం 30 పేద ఆర్యవైశ్య వితంతువులకు ఒక్కొక్కరికి రూ.300 చొప్పున వాసవీక్లబ్ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి సుబ్బరత్నయ్య, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకం లాభదాయకం


మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రమణ్యం

బుక్కరాయసముద్రం: గొర్రెల పెంపం మంచి లాభదాయకంగా ఉంటుందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం రెడ్డిపల్లిలో ఉన్న ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణ కేంద్రంలో గొర్రెల పెంపకం దారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రె పిల్లల సంరక్షణలో చాలా జాగ్రత్తలు పాటించాలన్నారు. పుట్టిన పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. డీడీ డాక్టర్ శాంతయ్య, డివిజన్ డీడీ డాక్టర్ రమేష్‌రెడ్డి, ఏడీ డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పద్మనాభం. డాక్టర్ రామసుబ్బారెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణంలోని హీరో షోరూమ్ వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... పెద్దవడుగూరుకు చెందిన ఫణిరాజారావు, రాజశేఖర్‌రావు బైక్‌పై పని నిమిత్తం గుత్తి కోర్టుకు బయలుదేరారు. అయితే అనంతపురం రోడ్డులో హీరో షోరూమ్ వద్ద గుంతకల్లు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పంటకోత ప్రయోగాలు

గుంతకల్లు రూరల్: తిమ్మనచెర్ల పొలాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పప్పుశనగలో పంటకోత ప్రయోగాలు చేపట్టారు. ఏడీఏ పద్మజ, ఏఓ కే.స్వాతి, ఏఎస్‌ఓ సిద్దప్ప ఆధ్వర్యంలో చేపట్టిన పంటకోత ప్రయోగాల్లో ఎకరాకు 3.5 క్వింటాళ్ల వరకూ పప్పుశనగ దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం వైటీ చెరువులో సాగుచేసిన వరి పంటను ఈ క్రాప్ బుకింగ్ తనిఖీ నిర్వహించారు.

పుట్లూరు: గోపరాజుపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పంట కోత ప్రయోగాలను జిల్లా ఉప గణాంక అధికారి తిరుమలాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పంట కోత ప్రయోగాలను పక్కాగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఏఎస్‌ఓ విజయ్‌కుమార్, వీపీఏ భార్గవి పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటాం


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

గుంతకల్లు: కేంద్రం మెడలు వంచైనా విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం సమీపంలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం రిలే నిరసన దీక్ష చేపట్టారు. 32 మంది బలిదానంతో 26 వేల మంది రైతుల త్యాగాలతో స్థాపించిన పరిశ్రమను ప్రైవేటీకరించడం మానుకోవాలని ఆయన కేంద్రాన్ని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, నాయకులు బి.మహేష్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో గొర్రె పిల్లల మృతి



యాడికి: వీరన్నపల్లెలో మంగళవారం రాత్రి పిచ్చి కుక్క దాడిలో గొర్రెపిల్లలు మృతి చెందాయి. వివరాలు...గ్రామానికి చెందిన రాజు గొర్రెల మందను గ్రామ శివారులో ఉంచాడు. రాత్రి ఓ పిచ్చి కుక్క మందలోకి చొరపడి ఉన్నఫలంగా గొర్రె పిల్లలపై దాడి చేసింది. భయపడిన రాజు అక్కడి నుంచి పారిపోయాడు. ఘటనలో 22 పిల్లలు మృతి చెందాయి. దాదాపు రూ.40 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ప్రసన్న పార్వతికి ప్రత్యేక పూజలు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలోని ప్రసన్న పార్వతీదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, సహస్ర కుంకుమార్చన చేపట్టారు. బిజినేపల్లి వెంకట శివ ప్రసాద్ ఉభయదారుగా వ్యవహరించారు. భక్తాదులకు తీర్థప్రసాదాలు అందించారు.

దంత వైద్యశిబిరం

గుంతకల్లుటౌన్: అవోపా, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సరస్వతీ విద్యామందిరం విద్యార్థులకు దంత వైద్యనిపుణులు డాక్టర్ వేల్పూరి ప్రభాకర్ దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించిన వైద్యుడు అవసరమైన వారికి మందులు, టూత్‌పేస్టులు అందజేశారు. ఈ సందర్భంగా 100 ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించిన వైద్యుడు ప్రభాకర్‌ను అవోపా, లయన్స్‌క్లబ్ వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాజగదీష్, ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్, అవోపా అధ్యక్షుడు చెన్నకేశవులు, కోశాధికారి రాజారమణ, లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ రేణుక, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

పుట్లూరు: వివాదాలకు దూరంగా ఉండకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తాడిపత్రి రూరల్ సీఐ వేణుగోపాల్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మడుగుపల్లిలో సిబ్బందితో కలిసి నాకాబందీ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రశాంతంగా జీవించాలని, సమస్యలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. రౌడీ షీటర్లపై నిఘా ఉంచామన్నారు. ఎస్‌ఐలు వెంకటప్రసాద్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రిప్ పైపుల అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఏ నారాయణపురంలోని రైతు శ్రీనివాసరెడ్డికి చెందిన డ్రిప్ పైపులు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధిత రైతు నాల్గో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన పొలంలో కొత్తగా ఏర్పాటు చేసిన 700 మీటర్ల డ్రిప్‌పైపులను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారన్నాడు. ఆరో రోడ్డుకు చెందిన వ్యక్తి, ఐదో రోడ్డుకు చెందిన మరో కలిసి ఏపీలైటింగ్స్ వద్దనున్న గుజిరీలో డ్రిప్ పైపులను విక్రయించినట్లు సమాచారం.

నార్పల వాసి ప్రతిభ

నార్పల: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కవితా సమ్మేళనంలో మండల కేంద్రానికి చెందిన వల్లెపు వెంకటసాయినాథ్ ప్రతిభ చాటాడు. దేశభక్తి–జాగృతి అనే అంశంపై నిర్వహించిన పోటీలో తాను రాసిన కవితకు నవభారత నిర్మాణ సంఘం వారు ప్రశంసాపత్రం అందజేశారు.

చౌక బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు

గుంతకల్లుటౌన్: చౌకబియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని తహసిల్దార్ బి.రాము, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మండల వీఆర్‌ఓలు, స్టోర్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌకబియ్యాన్ని ప్రజల నుంచి కొనుగోలు చేసి ఆ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారి వివరాలను తమకు తెలియజేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎండీయూ ఆపరేటర్లు బియ్యాన్ని డోర్ డెలివరీ చేయాలని, స్టోర్‌ల చుట్టూ ప్రజల్ని తిప్పుకోవద్దని సూచించారు.

భవిత విద్యార్థులకు అసెస్‌మెంట్ క్యాంప్

తాడిపత్రి: భవిత కేంద్రాల విద్యార్థులకు మంగళవారం ఎంఈఓ కార్యాలయ ఆవరణలో అసెస్‌మెంట్ క్యాంప్ నిర్వహించారు. ఎంఈఓ నాగరాజు, ఐఈడీ అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు షమా, వెంకటరమణ విద్యార్థులకు అవసరమైన విద్యా ఉపకరణాలు ఏవి, వాటితో మానసిక, విద్యా వికాసం ఎంత వరకు మెరుగుపడనుందన్న అంశాలను పరిశీలించారు. అనంతరం ఫిజియోథెరపిస్ట్‌లు మల్లిఖార్జున, రాధా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తాడిపత్రి, యాడికి, పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు మండలాలకు చెందిన ఐఈఆర్టీలు పాల్గొన్నారు.